క్లుప్తంగా

ఆక్వా సాగులో మేతల యాజమాన్యంపై అవగాహన

ఉండి: ఆక్వా సాగులో మేతల యాజమాన్యం అత్యంత ప్రాముఖ్యమైందని బలభద్రపురం రీసెర్చ్ ఆక్వా ఫామ్ శాస్త్రవేత్త డాక్టర్ సీపీకే ప్రభంజన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో ఉన్న మత్స్యపరిశోధనా కేంద్రంలో రెండో రోజు శుక్రవారం ఆక్వాసాగులో మేతల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఎన్ఎఫ్‌డీబీ హైదరాబాద్ ఆర్థిక సహాయంతో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ప్రభంజన్‌కుమార్ మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించేందుకు చెరువుల్లో వేసే మేతల గురించి రైతులు వివరంగా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మత్స్యపరిశోధనా కేంద్ర సిబ్బంది శివకుమార్, భీమేశ్వరరావు, షష్టి, రిష, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు పని భారం నుంచి విముక్తి కల్పించాలి


ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఆకివీడు: అదనపు పని భారం నుంచి ఆశ కార్యకర్తలకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక నగర పంచాయతీ వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కోశాధికారి లారెన్స్ కుమారి మాట్లాడుతూ యాప్‌ల ద్వారా విపరీతమైన పని ఒత్తిడి పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీ భారాన్ని కూడా ఆశ కార్యకర్తలపై వేశారన్నారు. అనంతరం నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పెంకి అప్పారావు, తోట పద్మ, వై.రామలక్ష్మి, జి.కనకమహాలక్ష్మి, మార్తమ్మ.అశ్విని, చిన్నాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దౌర్జన్యాలు చేయడం సిగ్గుచేటు


మాట్లాడుతున్న గంటా సుందర్ కుమార్

పాలకోడేరు: ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించే మీడియా గొంతుపై ఉక్కుపాదం మోపడం సిగ్గుచేటని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ అన్నారు. శుక్రవారం పాలకోడేరు మండలం కుముదవల్లి గ్రామంలో కొండేటి లాజర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార ప్రభుత్వ వైఫల్యాలను సాక్షి దినపత్రికలో ప్రచురిస్తుంటే ఆయా పత్రికల విలేకురులపై అక్రమ కేసులు బనాయించడం, వేధింపులకు గురి చేయడం, పత్రిక ఎడిటర్‌ను బెదిరించడం, సాక్షి కార్యాలయాలపై దాడులకు దిగడం వంటి అనైతిక చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు అని అన్నారు. ఇలాంటి అనైతిక దాడులను దళిత ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబటి ఆనందకుమార్, పట్టెం శుభాకర్, కురుకుంటి పౌలు తదితరులు పాల్గొన్నారు.

27న ఆప్కాబ్ కార్యాలయం వద్ద ధర్నా

భీమవరం: రాష్ట్ర వ్యాప్తంగా కోపరేటివ్ సొసైటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న విజయవాడ ఆప్కాబ్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా సహకార సంఘాలు, రూరల్ బ్యాంక్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు పి.విజయభాస్కరరావు కోరారు. శుక్రవారం భీమవరం డిసిసిబి బ్రాంచ్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. కంప్యూటరీకరణ పేరుతో గత ఏడాది నుంచి ఉద్యోగులపై మానసిక ఒత్తిడిని పెంచి పని భారాన్ని పెంచారన్నారు. కార్యక్రమంలో కె.రాజారామ్మోహన్‌రాయ్, కృష్ణశాస్త్రి, నాగ పెద్దిరాజు, నర్సింహరాజు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

దియా ఫెస్టివల్ పేరుతో జీఎస్టీ ముగింపు వేడుకలు

భీమవరం(ప్రకాశంచౌక్): జీఎస్టీ 2.0 ప్రచార వేడుకల ముగింపును ఆదివారం దియా ఫెస్టివల్ పేరుతో నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన చాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు జీఎస్టీ తగ్గింపులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం 'క్లీన్ ఎయిర్ థీమ్'తో కార్యక్రమాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు.

ప్రైవేటీకరణతో పేదలకు వైద్య విద్య దూరం

పీవీఎల్ నరసింహరాజు

ఆకివీడు: పేదలకు ప్రభుత్వ వైద్య విద్య అందకుండా కూటమి ప్రభుత్వం కుట్రపూరిత చర్యలు తీసుకుంటుందని వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు ఆరోపించారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలోని పార్టీ మండల అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య నివాసం వద్ద శుక్రవారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింహరాజు మాట్లాడుతూ వైఎస్సార్ కుటుంబంలోనే పేదలకు వైద్య విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో వేలాది మంది యువత సాఫ్ట్‌వేర్లు, డాక్టర్లు అయ్యారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మెడికల్ కళాశాలల్లో సీట్లు అందుబాటులోకి వచ్చి, తక్కువ ఖర్చుతోనే ఎంబీబీఎస్ విద్యను అభ్యసించే అవకాశం ఉండగా దానిని కూటమి ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మెడికల్‌కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించే చర్యలను ప్రతిఘటించాలని నర్సింహరాజు పిలుపునిచ్చారు. అనంతరం మహిళలు పీవీఎల్ నర్సింహరాజు ముందు సంతకాలను చేసి, నిరసన తెలిపారు. మండలంలోని కుప్పనపూడి, అజ్జమూరు, అయిభీమవరం, చెరుకుమిల్లి, మందపాడు, దుంపగడప గ్రామాల్లోని పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు సంతకాలు చేసి, కోటి సంతకాల సేకరణ ఫారాలను తీసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ కమిటీ అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), మంతెన సునిల్ కుమార్ వర్మ, కఠారి కేశవరావు,గుండా సుందరరామనాయుడు, సర్పంచ్‌లు గాలి సామ్రాజ్యం, నందమూరి ప్రకాశం, మడల పరిషత్ ఉపాధ్యక్షులు సైదాల సూర్యనారాయణ, సారా నాగబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మెంటే లక్ష్మణరావు, అల్లూరి సుబ్బరాజు, నాయకులు జీ.ధనరాజు, ఎరిచర్ల గ్లాడ్‌సన్, సాంబర్లిన్, అట్లూరి సంజయ్, కొట్టు మాణిక్యాలరావు, కురెళ్ల పౌలు, అద్దంకి ప్రసాద్, కురెళ్ల మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.


ఆకివీడు: కుప్పనపూడిలో కోటి సంతకాల పత్రాలతో పీవీఎల్ నర్సింహరాజు


భీమవరం: కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న వెంకటరాయుడు, నాయకులు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

భీమవరం: ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు నిరసనగా వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణలో భాగంగా పట్టణంలో శుక్రవారం 3,4,5 వార్డుల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా పేదలకు ఉన్నత విద్యనందించడానికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. పేదలకు వైద్య విద్యను అందించడానికి 17 ప్రైవేటు మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టి, ఇప్పటికే కొన్నింటిని పూర్తిచేయగా మిలిగిన కళాశాలలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసి పేదలకు వైద్యవిద్యను దూరం చేస్తోందని వెంకటరాయుడు విమర్శించారు. మెడికల్ కళాశాలల ప్రవేటికరణను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ భీమవరం పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, రాష్ట్ర ఎస్సీఈసీ మెంబర్ మేడిది జాన్సన్, స్టేట్ ఆర్టీఐ వింగ్ సెక్రెటరీ గుంటి ప్రభువు, జిల్లా యూత్ ప్రెసిడెంట్ చిగురుపాటి సందీప్, భీమవరం మండల యూత్ అధ్యక్షుడు బేతల్ సందీప్, జిల్లా మునిసిపల్ విభాగ ప్రెసిడెంట్ పేరిచర్ల సత్యనారాయణరాజు, పార్టీనాయకులు రుద్రాక్షల శ్రీను, రాయవరపు శ్రీనివాసరావు, దొంగ విజయ్ కుమార్, పైపూరి సూరిబాబు, మురళీకృష్ణ, మోకా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలి

కాళ్ల: తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి చెత్త నుంచి సంపదను సృష్టించాలని డిపిఆర్పీ టీమ్ మెంబర్ ఎడ్వర్డ్ అన్నారు. మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో శుక్రవారం చెత్త నుంచి సంపద సృష్టిపై కాళ్ళ, ఆకివీడు మండలాలకు చెందిన 49 మంది కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్(సీఆర్పీ) లకు ఒకరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. సీఆర్పీలు గ్రామంలోని ప్రతి కుటుంబానికి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరాజు వెంకటజగ్గరాజు, ఎంపీటీసీ సభ్యుడు చిన్నాపరపు రాంబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: పట్టణంలోని నరసయ్య అగ్రహారం ఫీడర్, 11 కేవీ రెస్ట్‌హౌస్ ఫీడర్స్‌లో చెట్టు కొమ్మలు తొలగించడానికి తాడేరు, గునుపూడి ఫీడర్‌లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు మార్చడానికి శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నరసయ్య అగ్రహారం, కుదుమువల్లి రోడ్, సీతారామ రాజుబొమ్మ ఏరియా, సీతమ్మ సెంటర్, నల్లంవారి తోట, బేతని పేట, నాచువారి సెంటర్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

సమస్యలను పరిష్కరించాలని ధర్నా


భీమవరం: ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


భీమవరం: విద్యుత్ శాఖ ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కారించాలని, లేకుంటే సమ్మె చేపడతామని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు హెచ్చరించారు. కార్మికుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భీమవరం ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే జమ చేయాలని, కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు యూనిఫాం, పనిముట్లు, సేఫ్టీ గ్లౌజులు, చీపుర్లు తదితర సామాగ్రి ఇవ్వడంలేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మి, బి.వసంతలక్ష్మి, టి.శారమ్మ, ఎం.సుధారాణి, దుర్గ, జె.ఏసుమణి, మంగ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

భీమవరం: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని విద్యుత్తు డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న స్ట్రగుల్ జేఏసీ జిల్లా చైర్మన్ జె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భీమవరం విద్యుత్ ఎస్ఈ ఆఫీసు వద్ద నిరసన ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు తెలంగాణ రాష్ట్రంలో చేసినవిధంగా సంస్థలు విలీనం చేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు జేఎల్ఎం, గ్రేడ్ 2 ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని, నాలుగు డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పాత పెన్షన్ స్కీము అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఈకి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, బి.వాసుదేవరావు, డి.నాగేశ్వరరావు, వి.సుభాష్‌చంద్రబోస్, జయ జానకి రాముడు, కె. శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.


వీరవాసరం: రోడ్లు వేయాలని వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రోడ్లు వేయాలని వినతి

వీరవాసరం: ప్రజలు ప్రాణాలు కాపాడాలంటే, నవుదూరు జంక్షన్ నుంచి మడుగు పోలవరం లంక వరకు భారీ వాహనాలు వెళ్లకుండా నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి డీఈ, ఈఈలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం భీమవరం వెళ్లిన సీపీఎం మండల నాయకులు తాళ్లూరి రామలక్ష్మణ్, యాళ్ల బండి నారాయణమూర్తి మండలంలో ఉన్న రోడ్ల గురించి చర్చించారు. రోడ్ల గురించి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఓట్లు కోసం హామీ ఇచ్చారన్నారు. తక్షణం నిధులు విడుదల చేసి వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

కార్మికులు, బాలలకు ప్రత్యేక పథకాలు

భీమవరం: జాతీయ న్యాయసేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన అసంఘటిత కార్మికులు, బాలల హక్కుల పరిరక్షణ పథకాలపై న్యూ మాడ్యుల్ లీగల్ సర్వీస్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి శుక్రవారం భీమవరంలో మండల న్యాయ సేవాసంస్థ, వివిధ ప్రభుత్వ శాఖల అధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ, మునిసిపల్, పోలీసు, డీఆర్‌బీఏ, లేబర్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, విద్య, వైద్య తదితర శాఖల సమన్వయంతో జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి, సంస్థ చైర్మన్ బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు, బాలల కోసం జాతీయ న్యాయసేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత అన్నిశాఖల అధికారులపైనా ఉందన్నారు. పథకాలపై అవగాహన కోసం శనివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో అన్ని శాఖల స్టాల్స్ ఉంటాయని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లక్ష్మీనారాయణ చెప్పారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.సుధారాణి, జి.సురేష్ బాబు, పి.హనీష, ఎస్.జ్యోతి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బీఎస్ఎన్ రెడ్డి, ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.యోహాను, మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి, జిల్లా లేబర్ అధికారిణి ఎ.లక్ష్మి, విద్యా శాఖ అధికారి ఇ.నారాయణ తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అరుదైన శస్త్ర చికిత్స

భీమవరం: స్థానిక అశోక్ కిడ్నీ సెంటర్‌లో శుక్రవారం అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించామని డాక్టర్ భూపతిరాజు అశోక్‌వర్మ (నెఫ్రాలజిస్ట్) తెలిపారు. ఒక మహిళకు పుట్టకతోనే (గుర్రపు డెక్క మూత్రపిండం) అసాధారణంగా పెరిగిన మూత్రపిండం ఉందన్నారు. దీంతో డాక్టర్ కుచ్చర్లపాటి అభిరామ్ (యూరాలజిస్ట్) నేతృత్వంలో మూత్రపిండంలో ఉన్న 6 సెం.మీ స్టాగ్ హార్న్ స్టోన్‌ను శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా తొలగించామని వివరించారు.


శస్త్ర చికిత్స వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు అశోక్‌వర్మ, అభిరామ్

సాక్షిపై కూటమి ప్రభుత్వ తీరు దారుణం

భీమవరం: కూటమి ప్రభుత్వంలో జరిగిన నకిలీ మద్యం వ్యవహారాన్ని ప్రజలకు ముందుకు తీసుకువెళుతున్న సాక్షి మీడియాపై ప్రభుత్వం, పోలీసుల తీరుకు నిరసనగా శుక్రవారం భీమవరంలో జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన నిర్వహించారు. నకిలీ మద్యం తయారీ, విక్రయాల వెనుక ప్రభుత్వ పెద్ద లున్నారనే అనుమానాలు సామాన్య ప్రజలు సైతం వ్యక్తం చేస్తుండగా నకిలీ మద్యం ముఠా వెనుక ఎవరున్నారనే అంశాన్ని సాక్షి మీడియా బయటపెట్టడంతో ప్రభుత్వం జీర్ణించుకోలేక సాక్షి ఎడిటర్ ఆర్.జనుంధయరెడ్డి, విలేకర్లపై అక్రమకేసులతో వేధించడాన్ని నిరసిస్తూ భీమవరం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాపై దాడులను ఖండించాలి. పత్రికాస్వేచ్ఛను కాపాడాలి, సాక్షిపై ప్రభుత్వం, పోలీసుల తీరు అమానుషం, విలేకర్లపై నిర్బంధాలను అరికట్టాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ కార్యాలయం వరకు ప్లకార్డులు, బ్యానర్‌తో ప్రదర్శన నిర్వహించి డీఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.


భీమవరంలో డీఎస్పీ కార్యాలయం వద్ద వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఆకివీడులో..

ఆకివీడు: పత్రికలపై దాడి, పత్రికా విలేకర్లు, ఎడిటర్లపై కేసులు వేయడం ఆకాశం మీద ఉమ్మి వేయడం లాంటిదేనని పలువురు వ్యాఖ్యానించారు. సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు, వేధింపులకు నిరసనగా ఉండి నియోజకవర్గంలోని పాత్రికేయులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు గుడిపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పత్రికా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పాత్రికేయులు బీఆర్.కోటేశ్వరరావు మాట్లాడుతూ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను వెలికి తీయడం పత్రికల బాధ్యత అన్నారు. అనంతరం రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వంటపాటి ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు అగ్నిహోత్రుల రాఘవ, నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు గేదల అప్పారావు, దొడ్డి జగదీష్, నాయకులు కురెళ్ల పౌలు, ఇంటి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం పరిశీలన

ఉండి: ఖరీఫ్ సీజన్–2025 కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సర్వం సిద్ధంగా ఉంచాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఉండిలోని రైతు సేవాక్రేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులకు పలు సూచనలు చేశారు.

భీమవరంలో ఉచిత వైద్య శిబిరం

భీమవరం: వ్యాధుల నివారణకు ధన్వంతరి ఎంతగానో కృషి చేశారని, ఆయుర్వేద వైద్య రంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శుక్రవారం ధన్వంతరి జయంతి సందర్భంగా జిల్లా నాయీబ్రాహ్మణ జేఏసీ అధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద, హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ ఎం.జగదీశ్వరీ, ఆయుర్వేద వైద్యుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఆరోగ్యాన్ని ప్రసాదించాలని దైవాలను పూజించడం హిందూ సంప్రదాయంలో ఒక భాగమని, ఆరోగ్య ప్రదాత ధన్వంతరి అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయీబ్రాహ్మణ జేఏసి ప్రెసిడెంట్ పట్నాల గణపతి, నాయీబ్రాహ్మణ సంఘం భీమవరం అధ్యక్షుడు మల్లువలస రఘుబాబు, జేఏసీ గౌరవాధ్యక్షుడు పిప్పళ్ల ప్రసాద్, చెరుకువాడ రంగసాయి. డాక్టర్ ఎం.గోవిందబాబు తదితరులు పాల్గొన్నారు.


ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఉపాధి కార్మికులకు పని దినాలు కల్పించాలి

భీమవరం అర్బన్: ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 పనిదినాలు కల్పించి, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎడ్ల చిట్టిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని వెంప గ్రామంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామస్తులకు పనులు లేని సమయంలో ఉపాధి పనులు కల్పించాలని చట్టం చెబుతున్నా అధికారులు పనులు చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శిగా తోటి శుభాకర్, కార్యదర్శిగా చిలకపాటి ఆనందరావు, అధ్యక్షులుగా చిలకపాటి శకుంతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాల అందజేత

భీమవరం(ప్రకాశంచౌక్): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం వీధి వ్యాపారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. రుణం తీసుకున్న వారు సక్రమంగా రుణాలు తిరిగి చెల్లిస్తే, వెంటనే రుణాలు అందిస్తారని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్ర ప్రసాద్ తెలియజేశారు. కార్యక్రమంలో మొత్తం 70 మందికి రూ.18 లక్షల రుణాలు మంజురు పత్రాలు అందజేశారు. యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ వెంకన్న బాబు, మెప్మా పీడీ హెప్సిబా, నాని బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో ఏఐ యాప్ ప్రొడక్ట్ లాంచ్

భీమవరం: నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకునేందుకు, ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారికి ఉపయోగపడే విధంగా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కోలా యశ్వంత్, చీమకుర్తి తేజ రూపక్ రూపొందించిన 90 హీల్ ఏఐ యాప్ ప్రొడక్ట్‌ను శుక్రవారం కళాశాలలో విడుదల చేశారు. సీఎస్‌డీ హెడ్ ఎం.సురేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 90 హీల్ సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈవో కొల్లూరు కిరణ్, ప్రొడక్ట్ టెక్నికల్ హెడ్ కొమ్మరాజు సాయిరవి చేతుల మీదుగా యాప్ లాంచ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం విషయంలో డైవర్షన్ డ్రామాలు

ఉండి: నకిలీ మద్యం స్కామ్ నుంచి తప్పించుకునేందుకే కూటమి ప్రభుత్వం డైవర్షన్ డ్రామాలాడుతుందని వైఎస్సార్ సీపీ ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శి బడుగు బాలాజీ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నకిలీ మద్యాన్ని రాష్ట్రంలో ఏరులై పారించి అడ్డంగా దొరికిపోయిన కూటమి ముఖ్య నాయకులు దానిని నుంచి తప్పించుకునేందుకే వైఎస్సార్ సీపీ నేతలపై కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.